క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పదో తరగతి విద్యార్థులు వచ్చే నెలలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ రంగయ్య అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి మంచి పునాదని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, జీఎంఆర్ స్కూల్ అధినేత జి.మల్లికార్జునరెడ్డి, కమల విద్యాసంస్థల చైర్మన్ పవన్‌కుమార్, తుమ్మల చెరువు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస మల్లికార్జున్, ఏఓ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక పూజలు



ఎడ్ల పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సమీపం తిరుమలనాథ స్వామి ఆలయ తిరునాళ్ల సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆరు పండ్ల సైజు విభాగం ఎడ్లకు బండ లాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి తిరునాళ్ల కార్యక్రమంలో ఎడ్ల పోటీలు ఎంతో ఉత్సాహభరితంగా ఉంటాయన్నారు. ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగించే ఇటువంటి కార్యక్రమాలను ప్రజలు ఎప్పుడూ ఆహ్వానిస్తారన్నారు. జెడ్పీటీసీ వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, బంగారు, విశ్వరూపం, వెంకటరమణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రామిరెడ్డికి బూచేపల్లి పరామర్శ



రామిరెడ్డితో మాట్లాడుతున్న బూచేపల్లి

తాళ్లూరు: మాజీ ఎంపీపీ కోట రామిరెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు సోమవారం పరామర్శించారు. రామిరెడ్డికి ఇటీవల ప్రమాదం జరిగింది. కంటికి దెబ్బ తగలడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చారు. రామిరెడ్డిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, కంటికి తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

ఆర్డీఓ చొరవతో గర్భిణికి ఆపరేషన్

కురిచేడు: సంచార జాతికి చెందిన ఎస్.లక్ష్మీదేవి నిండు గర్భిణి. 6వ కాన్పుకు సమయం ఆసన్నమైంది. ఆమెకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేకపోవటంతో ఆస్పత్రికి వెళ్లేందుకు నిరాకరించింది. ఆమె సమస్యను వైద్య సిబ్బంది ఆర్డీఓ సందీప్‌కుమార్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన ఆమెను 108లో రిమ్స్‌కు పంపాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వైద్యాధికారి ప్రవీణ్ 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆమెకు సహాయకులుగా ఆశాలు షేక్ మాబులా, సయ్యద్ గౌసియా, దోరేపల్లి నాగమణిలను పంపించారు. ఆమెకు ఆపరేషన్ చేసి డెలివరీ చేశారని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

పొదిలి: స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని నేతపాలెం యువకులు డిమాండ్ చేస్తున్నారు. స్థలం కేటాయించక పోవడంతో సోమవారం స్థానిక చిన్న బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ద్వారా అధికారులకు సిఫారసు చేయించారు. మున్సిపల్ కమిషనర్, దేవదాయ శాఖ ఈఓను పలుమార్లు కలిసినా స్థలం కేటాయించక పోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్నట్లు విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకుడు ధర్నాసి పెద్దన్న చెప్పారు. ఆరిక రాము, అశోక్ బండి, హజరత్, వడ్డే చినబాబు, ప్రసన్నకుమార్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పేరుకున్న విద్యుత్ బకాయిలు



మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్ డివిజన్‌లో విద్యుత్ బకాయిలు 18.29 కోట్లకు చేరాయి. ప్రధానంగా ప్రభుత్వ శాఖల బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. విద్యుత్ శాఖాధికారులు బిల్లుల వసూళ్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం పట్టణం, రూరల్, పెద్దారవీడు, దోర్నాల, తర్లుపాడు మండలాల్లో విద్యుత్ బకాయిలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో హెల్త్ అండ్ మెడికల్ వెల్ఫేర్ రూ.43.81 లక్షలు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ రూ.35 లక్షలు, ఆర్‌అండ్‌బీ రూ.3.44 లక్షలు, ఇరిగేషన్ రూ.14.01 లక్షలు, వివిధ ప్రభుత్వ గృహాలకు సంబంధించి రూ.4.20 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. విద్యాశాఖ రూ.50.94 లక్షలు, ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ రూ.3.61 లక్షలు, మొత్తంగా రూ.22.27 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉంది. సబ్ డివిజన్‌లోని మైనర్ పంచాయతీల్లో వీధిలైట్లు లైట్లు, తాగునీటి అవసరాలకు కేటగిరి–4 కింద మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో వాటర్ వర్క్స్, వీధి లైట్లు, కార్యాలయాలతో సహా రూ.1.70 లక్షలు, మార్కాపురం మండలంలో పంచాయితీరాజ్ విభాగం రూ.2.54 కోట్లు, పెద్దదోర్నాల మేజర్ పంచాయతీలో రూ.8.95 కోట్లు, పెద్దారవీడు పంచాయతీలో రూ.4.91, తర్లుపాడు రూ.1.87 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉంది.

> **బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి**
>
> 
>
> మార్కాపురం సబ్ డివిజన్‌లో విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దష్టి పెట్టాం. బిల్లుల వసూలుకు సిబ్బందిని నియమించాం. ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఆయా కార్యాలయాలకు బిల్లులు ఇచ్చాం. చెల్లించకపోతే ఫ్యూజులు తొలగిస్తాం. అందరూ బిల్లులు సకాలంలో చెల్లించి విద్యుత్ శాఖ అభివృద్ధికి సహకరించాలి.
>
> – సియానాయక్, డీఈఈ, మార్కాపురం

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



సన్మానం అందుకుంటున్న డాక్టర్ రాంబాబు

మార్కాపురం టౌన్: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని స్థానిక జిల్లా వైద్యశాల సీనియర్ ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.రాంబాబు అన్నారు. సోమవారం జార్జి ఫార్మసీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఫార్మసీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ నిజ జీవితంలో ఫార్మసిస్ట్‌ల సేవలు మర్చిపోలేమన్నారు. మందుల తయారీలో ఫార్మసిస్ట్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి శారీరక శ్రమ ఉండాలని, రోజుకు 40 నిమిషాలు వాకింగ్ చేయాలని, ఉప్పు, మసాలాలు, నూనెలు, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజాజయరామ్, హెచ్‌ఓడీలు సునీత, అశోక్‌బాబు, శివ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రాంబాబును ఘనంగా సన్మానించారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

దొనకొండ: నవరత్నాల్లో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఉగాదిలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహాలు నిర్మించుకునేందుకు శక్తి లేని లబ్ధిదారులకు బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని ఎంపీడీఓ తెలిపారు. గ్రామాల్లోని గృహాలు నిర్మించుకున్న వారికి వెంటనే దశల వారీగా బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోలేపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు రుణాలు అందజేశారు. ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, ఏపీహెం జి.వెంకటేశ్వర్లు, ఏపీఓ దేవయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



బ్యాలెట్ నమూనాలు విడుదల చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డిల విజయానికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను కోరారు. స్థానిక పొదిలి రోడ్డులోని సమావేశం హాలులో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచార కరపత్రాలు వారు ఆవిష్కరించారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మోటుపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోను వెంగళరెడ్డిని, అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్లపాటి సుధాఅచ్చయ్య, దొనకొండ, ముండ్లమూరు మండల పార్టీ కన్వీనర్లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, కురిచేడు జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కొమరోలు పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారి గెలుపు కోసం పట్టభద్రుల ఓటర్లు, ఉపాధ్యాయుల ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేస్తూ వారికి ఓటు వేసేలా పనిచేయాల్సి ఉంటుందన్నారు. జెడ్పీటీసీ వెంకట నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంగయ్య చౌదరి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 17వ వార్డు కౌన్సిలర్ దొంతా లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లబండ బజారులో సోమవారం ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రావు, గోపాల్ పాల్గొన్నారు.

దర్శి: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు చంద్రశేఖరరెడ్డి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలింపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. శ్రీధర్ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యం ఓటు వేసి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని మండల సచివాలయ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి, పార్టీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.బంగారురెడ్డి, ఎస్.బంగారురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి భారీ మెజారిటీ గెలిపించాలని కోరుతూ సోమవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. ప్రచారంలో కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కాలె వెంకటేశ్వర్లు, బాసు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచనల మేరకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఉడుముల గురవారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, మండల యూత్ నాయకులు సైకం వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చింతగుంట, బురదపాలెం, ఎదుర్లాళ్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

తాళ్లూరు: తూర్పు రాయలసీమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి కోరారు. శివరామపురంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు హనుమంతరావుతో కలిసి గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. తొలుత దర్శిలో వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్‌తో కలిసి గ్రాడ్యుయేట్ అభ్యర్థుల గెలుపునకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా



రాచకొండలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మద్దిశెట్టి శ్రీధర్

శనగలు కొనుగోలు



శనగలు కొనుగోలు చేస్తున్న ఏఓ

కొనకనమిట్ల: రైతులు పండించిన పప్పు శనగలను రేగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నాగరాజుకుంట రైతు భరోసా కేంద్రం వద్ద కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. ఆ మేరకు సోమవారం పప్పు శనగలు కొనుగోలు చేశారు. ఈ–క్రాప్ చేసిన పంటను కొనుగోలు చేస్తారన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అవకాశం ఉందన్నారు. శనగలు అమ్మే రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. విత్తనం నాణ్యతను బట్టి పప్పు శనగలు మద్దతు ధర క్వింటా రూ.5335 ఉందని ఆమె చెప్పారు. సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, అగ్రికల్చర్ సభ్యులు కామసాని శేషిరెడ్డి, ఎంపీటీసీ కె.భారతి పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రకాష్‌రావు తెలిపారు. శనగ పంట పండించిన రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు 4.4 క్వింటాళ్ల శనగలు మాత్రమే రైతు వద్ద కొనుగోలు చేస్తారని చెప్పారు.

రేపు కంటి వైద్య శిబిరం

కురిచేడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక దర్గా రోడ్డులోని మసీదు వెనుక కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నంద్యాల శాంతి రామ్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం స్వయం సేవకులు ఆరవీటి ఫౌండేషన్, ఒగ్గు నాసరయ్య ధర్మపత్ని ఆలి లక్ష్మమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో కంటిశుక్ల ఆపరేషన్ల వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరవీటి ఫౌండేషన్ చైర్మన్ వెంకట చిరంజీవి గుప్త కోరారు.

సంక్షిప్తంగా

గంగమ్మ ప్రతిష్ట ఉత్సవంలో జంకె



పూజలు చేస్తున్న జంకె వెంకటరెడ్డి, చైర్మన్ కృష్ణ

మార్కాపురం: పట్టణ శివారులోని మార్కెట్ యార్డు సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య ఉన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు జంకె, చైర్మన్‌ను సన్మానించారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



సన్మానం అందుకుంటున్న ఏఓ శ్రీధర్‌బాబు

ముండ్లమూరు: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని వ్యవసాయశాఖ ఏడీఏ ధనరాజ్ అన్నారు. బదిలీపై వెళ్లిన వ్యవసాయాధికారి శ్రీధర్‌బాబుకు సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సన్మాన సభ నిర్వహించారు. రైతులకు ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ముండ్లమూరు, తాళ్లూరు, అద్దంకి వ్యవసాయాధికారులు మీరమ్మ, ప్రసాదరావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు ఎదగాలి

పెద్దదోర్నాల: విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుని అత్యున్నత స్థానానికి చేరుకోవాలని ఎంఈఓ మస్తాన్ నాయక్ ఆకాంక్షించారు. సోమవారం బొమ్మలాపురం జెడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు తేవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సన్నిధి కిరణ్ కిశోర్ కుమార్, సానికవరం హైస్కూల్ హెచ్‌ఎం ఝాన్సీ లక్ష్మాబాయి, పీఎంసీ చైర్మన్ గండి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల ర్యాలీ

గిద్దలూరు రూరల్: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాజీ సైనికులు ఓఆర్‌ఓపీ–2కు నిరసనగా చేస్తున్న దీక్షకు మద్దతుగా గిద్దలూరులోని మాజీ సైనికులు స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ సైనికుల సంఘ నాయకులు చీమలదిన్నె లక్ష్మణ్‌బాబు నేతృత్వం వహించారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.

చెస్‌లో పెదారికట్ల విద్యార్థిని ప్రతిభ

కొనకనమిట్ల: ఏపీ చెస్ అకాడమి, చీమకుర్తి విద్యానికేతన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో మండలంలోని పెదారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుమ్మిత అశ్విని ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పీఈటీ షకీల, హెచ్‌ఎం నరసింహారావు తెలిపారు. ఆ మేరకు పాఠశాలలో అశ్వనికి మెమెంటో అందజేసి సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. షకీల మాట్లాడుతూ ఆరో తరగతి చదువుతున్న అశ్విని 11 ఏళ్ల కేటగిరిలో జిల్లా స్థాయి చెస్ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు శివ, ఉదయ్‌లు రెండో బహుమతి సాధించారని పేర్కొన్నారు.

7వ తరగతి విద్యార్థి అదృశ్యం



రాజ అర్జున్ (ఫైల్)

మార్కాపురం టౌన్: 7వ తరగతి చదువుతున్న తన కుమారుడు రాజ అర్జున్ సోమవారం ఉదయం 6 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఆది నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శశికుమార్ తెలిపారు. బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినా తన కుమారుడి జాడ తెలియలేదని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

దర్శి: అంతర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా మరియు సాంస్కృతిక పోటీల్లో రాష్ట్రీయ్య సాంస్కృతిక చాంపియన్‌షిప్‌ను స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బైరా ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం, నాట్యం మరియు నాటక పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రీయ సాంస్కృతిక చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. విజేతలకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ప్రమీలా రాణి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేష్ చౌదరి, ఉపాధ్యాయులు జి.నాగహరీష్, ప్రియాంక, సుశ్రుత్ దేవ్, మౌనిక పాల్గొన్నారు.

గోడ విషయంలో ఘర్షణ

కురిచేడు: ఇంటి గోడకు ప్లాస్టింగ్ చేసే విషయంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. వైద్యశాలల నుంచి వచ్చిన రిపోర్టుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దేవకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాకనాటి రెడ్ల బజారులో సూరే నాసరయ్య గుప్త నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. ఆయన ఇంటికి వెనుక ఇళ్ల వారికి ఇంటి పక్కన ఉన్న దారి విషయంలో చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం నాసరయ్య గుప్తా ఇంటికి ప్లాస్టింగ్ చేయించే క్రమంలో పాత గొడవలు మనసులో ఉంచుకుని రావూరి కృష్ణారావు వచ్చి నాసరయ్య గుప్తాపై వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలై వివిధ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయా వైద్యశాలల నుంచి రిపోర్టులు వచ్చాయి. ఆ రిపోర్టుల ఆధారంగా ఇరువర్గాలపై పరస్పర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దేవకుమార్ తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించే దిశగా ప్రతీ అధికారి పని చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామసుబ్బయ్య ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉగాదికి గృహనిర్మాణాల టార్గెట్, నీటి సమస్యలపై మండలంలోని అధికారులకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది లోపు గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో ప్రజలు నీటి సమస్య ఎదుర్కోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు, డీటీ ప్రసాదరావు, హౌసింగ్ డీఈ ఖదీర్‌బాషా, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

చౌడమ్మకు ప్రత్యేక పూజలు

● వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



చౌడమ్మా..చల్లంగా చూడంటున్న భక్తులు

కొనకనమిట్ల: చౌడమ్మ తల్లీ..దీవించమ్మా.. అంటూ భక్తులు జయజయ ధ్వానాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని మునగపాడులో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలతో పాటు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నాగేటి చాళ్లల్లో ఉద్భవించిన చౌడేశ్వరి అమ్మవారిని కొలిస్తే కాలం సుభిక్షంగా ఉంటుందని భక్తుల విశ్వసిస్తారు. ఆ విశ్వాసంతోనే మునగపాడు, సమీప గ్రామాలకు సంబంధించి కుటుంబాలు ఎక్కడ స్థిర నివాసం ఉన్నా ఉత్సవాల రోజు వచ్చి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీ. గ్రామంలోని తొగటవీర క్షత్రియులు అమ్మ వారిని కులదేవతగా కొలుస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ప్రాంత ప్రజలు తమ సంతానానికి చౌడయ్య, చౌడమ్మ, చౌడేశ్వరి అనే పేర్లు పెట్టుకుంటారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు మునగపాడు, వెలిగండ్ల గ్రామ పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు రకాల షాపుల వద్ద సందడి నెలకొంది. పండగ వాతావరణంలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్‌ఐ దీపిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.